# ఒక సంఘటన

శ్రీ కాశూరి హనుమంతరావు

ప్లాట్ ఫారమ్‌మీద పెళ్లివారిదృశ్యం డాక్టర్ శర్మని అనోవిగంగా ఆకర్షించింది. ఏభై సంవత్సరాల వయస్సు దాటిపోయి ఇప్పుడిప్పుడే ముడతలు పడుతున్న అతడి ముఖంమీద సానుభూతి ఛాయగా వ్యాపించింది. వాళ్ళందరూ కూడా తన మాతృభాష లోనే మాటాడుతున్నారు. ఐదు సంవత్సరాలు విదేశంలో ఉండిపోయి తిరిగి రావడం, తన మాతృభాష మాట్లాడే ప్రజలని కలుసుకోవడం, అన్నిటికన్నా పెళ్లికుమార్తెను అత్తవారింటికి వీడ్కొలుపుతున్న ఆ దృశ్యం అతడి మనస్సును ఉద్వేగంతో నింపేయి.

రైలు బయలుదేరబోతోంది. గార్డు విజిల్ ఊదాడు. ఆ అబ్బాయి, క్రొత్తగా పెళ్ళయిన అతడి భార్య, అతడి ముసలి తలిదండ్రులు డాక్టర్ శర్మ ఉన్న కంపార్ట్‌మెంట్‌లోకి వచ్చేరు. తల్లిదండ్రు లిద్దరూ లోపలికి వచ్చేసి కిటికీలోంచి బంధువులందరి దగ్గరా సెలవు తీసుకొంటున్నారు. ఆ అబ్బాయి, అమ్మాయి గేట్ దగ్గర నిలబడ్డారు.

“వెళ్ళొస్తానమ్మా. వస్తాను నాన్నా.” ఆ అమ్మాయి ప్లాట్ ఫారమ్‌మీద నిలబడ్డ తన తలిదండ్రులతో దీనంగా అంది. సహజంగా పెరుగుతున్న చోటు నుండి ఊడదీసి ఇంకోచోట పాతిన మొక్కలాగ ఆమె ముఖం వాడిపోయి బెంగగా ఉంది.

“వెళ్ళగానే ఉత్తరం రాయమ్మా.” ఆమె తండ్రి అన్నాడు. వెంటనే ఆ అబ్బాయిని చూసి మళ్ళీ అదే అడిగాడు.

“అలాగే నాన్నా.”

“తప్పకుండా రాస్తానండీ.” ఇద్దరూ అన్నారు. కూతుర్ని అత్తవారింటికి పంపించి వేస్తున్న ఎడబాటు మనస్సుని క్రుంగదీస్తున్నా ఆ అమ్మాయి తండ్రి ఎంతో ప్రయత్నంమీద పైకి లేని ధైర్యాన్ని ప్రకటిస్తున్నాడు. ఆ అమ్మాయి తల్లి కళ్ళు రెండూ కరిగి కన్నీరై ప్రవహిస్తున్నవి. వీళ్ళందరి మధ్యా ఆ అబ్బాయి పరిస్థితి విషమంగా ఉంది.

రైలు కూతకూసి బరువుగా కదిలి బయలుదేరింది. ప్లాట్ ఫారమ్ క్రమంగా వెనక్కి నిర్గమిస్తున్నది. ఆ అమ్మాయి తన తల్లిదండ్రులనుండి కోసి వేరుచెయ్య బడుతున్నది. నిర్నిమేషమైన దృష్టులతో రైల్లో పోతున్న తమ కూతుర్ని చూస్తూ ఆ తల్లిదండ్రు లిద్దరూ రెండు శిలావిగ్రహాలవలె ప్లాట్ ఫారమ్‌మీద నిలబడిపోయారు. ఆ ఫస్ట్ క్లాస్ కంపార్ట్‌మెంట్ గేట్ దగ్గర నిలబడ్డ తమ కూతురుతప్ప తక్కిన రైలేమీ వాళ్లకి కనిపించడం లేదులా ఉంది.

రైలు మలుపు తిరగడంతో ఈ దృశ్యం అంతా తటాలున మారిపోయింది. ఆ అబ్బాయి, అమ్మాయి లోపలికి వచ్చి సామానులు సర్దుకొని పక్క చుట్టలు విప్పుకోసాగేరు. డాక్టర్ శర్మ ఇదంతా కొంతసేపు కుతూహలంగా పరిశీలించాడు. ఆ కంపార్ట్‌మెంట్ లోని ఆరో వ్యక్తికి సుమారు నలభై సంవత్సరా లుంటాయి. అతడిలో ప్రత్యేకలక్షణాలేవీ లేవు. సిగరెట్టు కాలుస్తూ న్యూస్ పేపర్ చదువుతున్నాడు.

రైలు క్రమక్రమంగా వేగం హెచ్చుతున్నది. టక్ టకా టక్ టకా అనే నిర్విరామమైన రైలు ధ్వనులు ఒకేశృతిలో డాక్టర్ శర్మ కర్ణపుటాలకి వినబడతాయి. దగ్గరగా ఉన్న చెట్లు, పొదలు, టెలిఫోన్ స్థంభాలు చర్ చర్‌మని వెనక్కిపోతాయి. కాస్త దూరంలో ఉన్న చెట్లు, ఎలెక్ట్రిక్ స్థంభాలు రైలుతోబాటే ముందుకి వస్తాయి. కనుచూపు మేరలో ఉన్న పచ్చటి ముద్దలవంటి చెట్లశిఖరాలు, చెట్లఆకారాలు, దృక్పథపు చివరలో నీలి ముసుగులు వేసుకొన్న కొండలు—ఇవన్నీ ఒక పెద్దవలయంలో తమలో తామే సుళ్లు తిరుగుతాయి.

సాయంకాలం సూర్యుడివేడి తగ్గినా ఇంకా ఎండ పోలేదు. ఒకవైపునుండి ఎండ కాస్తూఉంటే

ఇంకోవైపునుండి వర్షం పడుతోంది. ఏటవాలుగా ప్రసరిస్తున్న సూర్యకాంతిలో వాన చినుకులు తళతళ మని మెరుస్తున్నాయి. వర్షార్ద్రప్రకృతిని సూర్య కాంతులు మృదువుగా స్పృశించి ఆకాశంలో తూర్పు దిక్కున రమ్యమైన ఇంద్రధనుస్సును చిత్రిస్తున్నవి. భూమి తడిగా ఉంది. చెట్లు వర్షం కారుతున్నాయి. ఎంతో రమణీయంగా ఉంది ప్రకృతి. ప్రకృతి తలనిండా స్నానంచేసి సౌందర్యోపాసన చేస్తున్నట్లుఉంది. భగవానుని సౌందర్య స్వరూపాన్ని ధ్యానం చేస్తున్నట్లుగా ఉంది.

ఎండ, వాన, ఇంద్రధనుస్సు—ఇవన్నీ ప్రకృతిలో ఎలాగ ఏర్పడుతాయో సైన్సు మనకు విడదీసి చూపుతుంది. కాని మానవ ఆత్మ వీటిలో సైన్సుకి అందని అనుభూతిని, ఉత్కంఠను పొందుతుంది. ఈ సృష్టికి సైన్సు సరియైన నిర్వచనం అవునా? కాదా? అనేది చాలా చిక్కు సమస్య.

ఈ సమస్య కొంతవరకూ డాక్టర్ శర్మ వ్యక్తిత్వానికి సంబంధించినది. కాని ప్రస్తుతం అతడు ఆ సమస్యని తర్కించడం లేదు. అతడికి కంపార్ట్‌మెంట్‌లో తనతో ఉచితమైన సంభాషణచేసే తోటి ప్రయాణికులు దొరకలేదు. ఆ అబ్బాయి తల్లిదండ్రులు బద్ధకంగా శరీరాలు వాల్చారు. నిర్విరామమైన రైలు ధ్వనుల శ్రుతి వారిమీద మత్తుమందులాగ పనిచేస్తున్నది. ఆ అబ్బాయి తన సూట్‌కేస్ తెరచి, అందులోనుంచి ఒక పుస్తకంతీసి చదవసాగాడు.

ఆ అమ్మాయి ఏదో సినిమా మేగజీన్ పేజీలు త్రిప్పుతున్నది. డాక్టర్ శర్మని ఆమె అలంకరణ, క్రొత్తగా పెళ్ళయిన స్త్రీని అత్తవారింటికి సాగనంపుతున్న అలంకరణ అమితంగా ఆకర్షించింది. పారాణి పూసిన ఆమె పాదాలమీద సరిక్రొత్తచీర కుచ్చెళ్ళు జీరాడుతున్నాయి. నుదుటిమీద కళ్యాణతిలకం, కళ్లకి కాటుక—పెళ్లికళతో ఆమె ముఖం నిండుగా వెలిగింది. ఆ మెజడలోని తెల్లటి, ఎఱ్ఱటి, పచ్చటి రంగులపువ్వులు ఆనందంతో విచ్చుకొన్నాయి.

పువ్వులలో సౌందర్యాన్ని డాక్టర్ శర్మ ఒక ప్రత్యేకమైన పద్ధతిలో మెచ్చుకొని ఆనందిస్తాడు. పువ్వులలోని పరిమళం, రంగు, మృదుత్వం ఇవి కేవలం భౌతికమైనవి అనీ, మైక్రోస్కోప్ క్రింద పరీక్షిస్తే పువ్వులలో జీవశక్తి, అసలు సౌందర్యం కనిపిస్తుందనీ అతడు వాదిస్తాడు. తన సహోపాధ్యాయుడు వ్రాసిన ఒక పుస్తకానికి పరిచయవాక్యాలు వ్రాస్తూ చెట్లలో సౌందర్యంగురించి తన అభిప్రాయాన్ని ఇట్లా వ్యక్తపరచాడు.

"ఒక చిన్న కొయ్య ముక్క, ముసలివాళ్ళు ఊతగా ఉపయోగించే కఱ్ఱలో ఒక సన్నటి ముక్కని కోసి మైక్రోస్కోప్ క్రింద పరిశీలించిచూస్తే అందులో జైలమ్ కణాల సముదాయం ఎంతో అందంగా కనిపిస్తుంది. ఎండి నిర్జీవమై పోయిన ఒక కొయ్య ముక్కలో మైక్రోస్కోప్ క్రింద ఇంతఅందం కనిపించినప్పుడు, నిండా జీవిస్తున్న పువ్వులు మొదలైన వాటిలో ఎంత అందం కనిపిస్తుందో చెప్ప నక్కర లేదు. ప్లాంట్ అనాటమీ చెట్లలో అంతరంగా దాగి ఉన్న సౌందర్యాన్ని బయటికి చూపుతుంది" అని వ్రాశాడు.

సైన్సు, డాక్టర్ శర్మ హృదయంలో ఉద్వేగ కలిగించడం ఈ వాక్యాలలో తెలుస్తుంది. సైన్సుని ఒక వృత్తిగా, కాలక్షేపంగా మాత్రమే కాకుండా, జీవిత సమస్యలని పరిష్కరించుకొనే సాధనంగా డాకర్ శర్మ స్వీకరించాడు. ఈ ఉద్దేశంతోనే జీవశాస్త్ర విజ్ఞానాన్ని సామాన్యప్రజలకి అందించడానికి అతడు ఎన్నో వ్యాసాలు వ్రాశాడు. "ది ఆరిజిన్ ఆఫ్ లైఫ్", "మ్యుటేషన్స్ అండ్ ఇవొల్యూషన్", "ది ప్రోపర్‌టీస్ ఆఫ్ ప్రొటోప్లాజమ్", "మేన్స్ ప్లేస్ ఇన్ నేచర్", "ది ఫ్యూచర్ ఆఫ్ మేన్ అండ్ ఆఫ్ లైఫ్", "హెరిడిటి అండ్ సోషల్ ప్రోబ్లమ్స్"—ఇవి అతడువ్రాసిన కొన్ని వ్యాసాలు. ఇవన్నీ ఒక సంపుటిగా "లైఫ్ అండ్ నేచర్" అనేపేరున ప్రకటించబడ్డాయి. ఈ పుస్తకం డాక్టర్ శర్మకి జనసామాన్యంలో ఎంతో కీర్తిని కలిగించింది. ప్రస్తుతం అతడు పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులకి ఉపయుక్తంగా ఉండేటట్టు జెనెటిక్స్‌మీద ఒక పుస్తకం వ్రాసే ప్రయత్నంలో ఉన్నాడు. ఆ పుస్తకానికి కావలసిన గ్రంథమంతా ఎంతో దీక్షతో సమకూర్చుకొంటున్నాడు. డాక్టర్ శర్మకి కార్యదీక్షా, విజ్ఞానతృష్ణా అపారం. రోజూ ఉదయాన్నే లెబొరేటరీకి పోవడం, సాయంకాలంవరకూ శాస్త్రపరిశోధనలో గడపడం, రాత్రి పడుకోబోయేముందు సుమారు నూరుపేజీల ఏదైనా శాస్త్రగ్రంథాన్ని చదవడం-గత ఇరవై అయిదేళ్లుగా అతడి దినచర్య సరిగా, ఇదే ప్రణాళికలో జరుగుతూ

వచ్చింది. ఈ ఇరవై అయిదేళ్ళలోనూ అతడు చేసిన శాస్త్ర పరిశోధన ప్రపంచంలో అందరి శాస్త్రజ్ఞుల మన్ననలనూ అందుకొన్నది. జెనెటిక్స్‌లో ప్రపంచం మొత్తంమీద అగ్రగణ్యులైన శాస్త్రజ్ఞులు కొద్దిమంది లోనూ డాక్టర్ శర్మ ఒకడు ఏభైఏళ్ళు దాటి పోయినా అతడికి గల విజ్ఞానతృష్ణ తగ్గలేదు సరికదా హెచ్చుసాగింది. ఈ విషయంలో డాక్టరుశర్మ ఎంతో గర్వపడతాడు. అతడి జీవితమంతా ఒక విజ్ఞానయాత్ర వలె సాగుతోంది. విజ్ఞానతృష్ణ, జీవితంలో కార్యదీక్ష లేని మనుష్యులను, ముఖ్యంగా యువకులను డాక్టరు శర్మ క్షమించలేడు. అంగుచేతనే ఆ అబ్బాయి ఒక నవలని ఎంతో కుతూహలంతో చదవసాగినప్పుడు అతడి అభిప్రాయంలో ఆ అబ్బాయి మనస్తత్వం పైన ఒక నిరాదరణ, చిన్నచూపు కలిగేయి. ఆ నవలకి బదులుగ ఒక సైన్స్ న్యూస్ సంపుటంగాని, విజ్ఞానదాయకమైన మరొక పుస్తకంగాని అతడు చదివినట్లయితే డాక్టర్ శర్మ అతడిని మెచ్చుకొని వుండును. ఈ తేలికభావం తోనే నవల చదువుతున్న అతడి ముఖకవళికలని డాక్టర్ శర్మ పరిశీలించసాగాడు. కథలోని ఏదో విషాద సంఘటనని బట్టి కాబోలు అతడి ముఖంలో సానుభూతి స్పష్టంగా కనిపిస్తున్నది. ఆ అబ్బాయి నవలలో గబగబా కొన్ని పంక్తులు చదివి, పుస్తకం ప్రక్కని పెట్టి, తన భార్యవంక తిరిగి—

"నటాషా! ఈ కథలో నటాషా అనేఅమ్మాయి క్షణికమయిన ఆకర్షణ, మోహంవల్ల జీవితంలో శాశ్వతమయిన ప్రేమను పోగొట్టుకుంటుంది. ప్రపంచంలో ఇది సాధారణంగా జరిగే పొరపాటు" అన్నాడు. ఆ అమ్మాయి తన పుస్తకంలోనుంచి తలపైకెత్తి, అంతా శ్రద్ధగా విని, జవాబు చెప్పడానికి ఏమీ లేనందువల్ల తిరిగి తన పుస్తకం చదవడంలో నిమగ్నురాలయి పోయింది.

ఈ ఇతివృత్తం డాక్టర్ శర్మకి సరదా కలిగించలేదు. ప్రేమకి అతడి మనస్థితిని తాకేశక్తిలేదు. అతడికీ అతడి భార్యకీగల సంబంధంలో ప్రేమయొక్క ఉద్వేగము లేదు. అది మిక్కిలి సాధారణమైనదీ, బాహిరమయిన లౌకిక మర్యాదలకు సంబంధించినది. భార్యను గురించి అంతకన్నా ఎక్కువశ్రద్ధ తీసుకొందుకి అతడికి నిత్యజీవితంలో వ్యవధి లేకపోయింది. అందుచేతనే అతడి మనస్థితికి ఆ ఇతివృత్తం పేలవంగా తోచింది. ఆ అబ్బాయిని పరిశీలించడం విరమించేడు. కాలం గడవడానికి మంచిపుస్తకం ఏదీ దగ్గర లేకపోవడము డాక్టర్ శర్మకు చికాకు కలిగించింది. ఉత్తమమైన ఉపయోగకరమైన శాస్త్రగ్రంథాలు ఎన్నో అమెరికాలో కొని అతడు తెస్తున్నాడు. కాని అవన్నీ నెమ్మదిగా ఓడమీద వేరే వస్తున్నాయి. అతని దగ్గర ప్రస్తుతం ఏదీ పుస్తకం లేదు. కాలం ఎలా గడుస్తుందో తెలియదు.

బయట క్రమంగా చీకటి ముసరి దట్టంగా వ్యాపించింది. రైలేదో స్టేషనులో ఆగింది. తక్కిన ప్రయాణీకు లందరూ రాత్రి భోజనాలు చెయ్యడాని కుపక్రమింప సాగారు. శర్మకి ఆకలిగా లేదు. కొన్ని పళ్ళు కొనుక్కొని తినసాగాడు.

"మీరు రాత్రి భోజనం చేయరా?"—ఆ అబ్బాయి డాక్టర్ శర్మని ఉద్దేశించి ఇంగ్లీషులో అడిగేడు.

"ఆకలిగా లేదు" అని శర్మ ఇంగ్లీషులో చెప్పేడు.

"ఎక్కడికి వెళ్తున్నారు?" ఆ అబ్బాయి మళ్ళీ ప్రశ్నించాడు.

"వాల్టైర్" అన్నాడు శర్మ.

"మీరు తెనుగువాళ్లా?" ఆ అబ్బాయి ఉత్సుకతతో తెనుగులో అడిగాడు.

"అవును." అన్నాడు శర్మ. తక్కినవాళ్ళంతా అతడిని అభిమానంతో చూశారు.

"మేమూ విశాఖపట్నమే వస్తున్నాం" అన్నాడు ఆ అబ్బాయి. తర్వాత కొద్ది క్షణాలు నిశ్శబ్దంగా గడిచింది.

"మీది విశాఖపట్నమా?" ఆ అబ్బాయి మళ్లీ ప్రశ్నించాడు.

"అవును." అన్నాడు శర్మ. తర్వాత ఆ అబ్బాయి డాకర్ శర్మ ఉద్యోగం వాటినిగురించి ప్రశ్నిస్తూ సంభాషణచేశాడు. డాక్టర్ శర్మ విశ్వవిద్యాలయంలో వృక్షశాస్త్రంలో ప్రధానోపాధ్యాయుడు. విజిటింగ్ ప్రొఫెసర్ గా అమెరికావెళ్ళి, ఐదు సంవత్సరాలు అక్కడఉండి తిరిగి వస్తున్నాడు. ప్రస్తుతం అతడు ఆ ప్రయాణంలోనే ఉన్నాడు.

"మీది విశాఖపట్నమా?" ఈసారి ప్రశ్నించే వంతు తనది అని తోచి శర్మ ప్రశ్నించేడు.

"అవును. నేనక్కడే మెడిసిన్ చదువుతున్నాను." ఆ అబ్బాయి అన్నాడు. డాక్టర్ శర్మకి తన పెద్దకొడుకు ఈ మధ్యనే ఎమ్. డి. పేసయినట్లు వ్రాసిన ఉత్తరం జ్ఞాపకం వచ్చింది. అతడి రెండో కొడుకు అమెరికాలో భౌతికశాస్త్రంలో పి. హెచ్. డి కి చదువుతున్నాడు. శర్మ అతడి కూతుర్నీ, ఆఖర కొడుకునీ భార్యతో స్వదేశంలో విడిచిపెట్టి అమెరికా వెళ్ళేడు. కూతురు తను నిష్ణాతుడైన వృక్షశాస్త్రంలో నే బి. యస్. సీ. చదువుతోంది. ఆమెను ఆ శాస్త్రంలో చాలా పెద్దదాన్ని చెయ్యాలని అతడి గాఢ ఆశయం. ఆఖరికొడుకు పిన్నవాడు. కాన్వెంట్ లో చదువుతున్నాడు. క్లాసులో ప్రతి సబ్జెక్టులోనూ ఫస్టుమార్కు తనదేనని విదేశంలో ఉండే తండ్రికి ఉత్తరాలు వ్రాస్తూ ఉండేవాడు. తన విజ్ఞాన పిపాసా, తెలివితేటలూ తన బిడ్డలందరకూ సంక్రమించినందుకు డాక్టర్ శర్మకి చాలా సంతృప్తిగా ఉంది. అసలు అతడి బిడ్డలందరి విద్యాభ్యాసం, లోకజ్ఞానం, సంస్కృతి అన్నీ తన అభిప్రాయంలో ఉత్తమ అభిరుచులు అనుకొనేవాటి ప్రకారమే ఏర్పరుపబడ్డాయి.

డాక్టర్ శర్మకీ, ఆ అబ్బాయికీ అభిరుచులలో సారూప్యంలేదు. అంతేకాదు, శర్మ ఉద్దేశంలో చాలా అంతరం ఉంది. అందుచేత నే తర్వాత వాళ్ళిద్దరి మధ్యా సంభాషణ సరదాగా సాగలేదు. ఏదో కాలం గడిపివెయ్యడానికిమాత్రం వినియోగపడింది. అమెరికా దేశం, అక్కడ లేబొరేటరీలలోని సౌకర్యాలూ వీటిని గురించి చాలాసేపు మాట్లాడుకొన్నారు. ఆ అబ్బాయి తల్లిదండ్రులు నిద్రపోడానికి ఉపక్రమిస్తున్నప్పుడు శర్మ టైమ్ చూశాడు. రాత్రి పదిగంటలు కావస్తోంది. తనుకూడా పడుకొందుకి బట్టలు మార్చుకొన్నాడు.

"నిద్రవస్తోందా?" ఆ అబ్బాయి తన భార్యని గోముగా అడిగాడు.

"ఏమో!" అంది ఆమె విలాసంగా ఒళ్లు విరుచుకొంటూ. లైట్లన్నీ ఆర్పేసి అందరూ నిద్రకి ఉపక్రమించారు. కంపార్ట్ మెంట్ లో నిశ్శబ్దం రైలు ధ్వనుల శృతిని అధికం చేస్తున్నది. రైలు చాలా వేగంగా పోతూ పట్టాలమీద తేలిపోతున్నట్లుగా పోతున్నది. డాక్టర్ శర్మ కళ్ళు మూసుకొన్నాడుగాని ఆలోచనలు పరిపరివిధాలుగా పోతున్నాయి. తన ఏభైఏళ్ళ జీవితం, సాధించిన గొప్ప కార్యాలూ వీటి గురించి ఒకసారి ఆలోచిస్తాడు. ఇంకోసారి అతడి మనస్సు ఇంటి దిక్కుగా భార్యా బిడ్డలవైపు ప్రసరిస్తుంది. మరోసారి అమెరికాదేశపు లేబొరేటరీలలోని సౌకర్యాలూ, హిందూదేశపు లేబొరేటరీల దీనపరిస్థితులు వీటి గురించి బాధతో ఆలోచిస్తాడు. అతడికి ఎప్పుడు నిద్ర వచ్చిందో అతడికే తెలియదు.

ఎప్పుడు తెల్లవారిందో తెలియదు. ఎప్పుడు రాత్రి వర్షం కురిసి కురిసి వెలిసిందో తెలియదు. డాక్టర్ శర్మ నిద్ర లేచేసరికి బాగా ప్రొద్దెక్కింది. అంతా ఇదివరకే లేచిఉన్నారు. ఆ నలభై ఏళ్లాయన వచ్చే స్టేషన్లో దిగిపోవడానికి తయారవుతున్నాడు.

రైలేదో జంక్షన్లో ఆగింది. అంతా ఫలహారాలు చేశారు. రైలు తిరిగి కదిలే వేళ అయింది. ఆ అబ్బాయి చాలా ముందుగా టిఫిన్ ముగించి బుక్ స్టాల్ లో పుస్తకాలేమైనా ఉంటాయేమో అని వెళ్లాడు. ఇంకా తిరిగి రాలేదని అతడి తల్లి దిగులుపడుతోంది.

అవతల ప్లాట్ ఫారమ్‌లో బుక్ స్టాల్ లో పుస్తకాలు చూస్తున్న ఆ అబ్బాయి పరధ్యానంగా రైలు బయలుదేరబోవడం చాలాసేపటి వరకూ గమనించలేదు. తీరా రైలుకూత కూసి కదులుతూ ఉండగా చప్పున పుస్తకాలు పడేసి తొందరగా పరుగెత్తాడు. ప్లాట్ ఫారమ్‌లో చాలా ముందుగా ఉన్న తన కంపార్ట్ మెంట్ వైపు చూసుకుపోయాడు. అతడు పరుగెత్తుతూ తమ కంపార్ట్ మెంట్ ను సమీపించడం డాక్టర్ శర్మ ముందుగా చూశాడు. ఒక్క క్షణం అతడు తను పెట్టెని అందుకోలేడని సందేహించి వెనకాల ఏదైనా పెట్టెలోకి ఎక్కేస్తే బాగుండునని అనుకొన్నాడు. మరుక్షణంలోనే ఆ అబ్బాయి తమ పెట్టెను చేరుకొన్నాడు. గేట్ ని పట్టుకొని, కొన్ని గజాలు రైలుతో బాటే ముందుకి పరుగెత్తి లోపలికి దూకాడు.

కాని! ఏడీ అతడు? ఏమైపోయాడు? అంతా కెవ్వున కేక వేసి గేట్ దగ్గరకి పరుగెత్తారు. ఎవ్వరికీ ఏమి చెయ్యడానికీ తోచకుండా బుద్ధి శూన్యంగా ఉంది. రైలు హఠాత్తుగా ఆగిపోయి అంతా త్రుళ్లిపడ్డారు.

........................

రైలుని కొన్ని ఫర్లాంగులు వెనక్కి నడిపించి ఆ అబ్బాయి మృతకళేబరాన్ని బయటకి తీశారు. కొద్దిక్షణాలలో స్టేషనంత హాహాకారాలతో, సానుభూతితో, ఆశ్చర్యంతో నిండిపోయింది. ఏదో ముడో పగబట్టి ఇలా చేశాడని అంతా అనుకుంటున్నారు. ఆ అబ్బాయి తల్లిదండ్రులు గుండెల్ని అరచేతులతో బాదుకొంటూ ఏడుస్తున్నారు. ఆ అమ్మాయి విలాపానికి అంతులేదు. ఈ దృశ్యాన్ని చూస్తున్న డాక్టర్ శర్మ రెండు కళ్ళూ రెండు అగ్నిగోళాలవలె జ్వలించిపోయాయి. అతడిని ఈ సంఘటన బాగా కదిపివేసింది. ఇలాటి రైలు ప్రమాదాలని అతడు ఇదివరకు ఎప్పుడూ చూడలేదు. రైళ్ళక్రిందపడి మనుష్యులు చచ్చిపోవడం వార్తాపత్రికలలో చదివాడు. కాని అవి కొన్ని చెరువార్తలకన్నా ఎక్కువ ఏమీ కావు. ఆ అబ్బాయి భార్యని ప్రేమిస్తూ, తల్లిదండ్రులతో మాట్లాడుతూ ఇప్పటిప్పటివరకూ తన కళ్ళముందు నిండా జీవిస్తూనే ఉన్నాడు. ఒక్క క్షణంలో రైలు ప్రమాదానికి లోనై చచ్చిపడి ఉన్నాడు.

డాక్టర్ శర్మ వెళ్ళి ఆ అబ్బాయి శిథిలశరీరాన్ని చూశాడు. అబ్బ! ఘోరంగా ఉంది. కొన్ని క్షణాలసేపు జీవితం, మరణం ఇవి కొన్ని శాస్త్రీయమైన పద్ధతులుగా అతడికి కనిపించడం హఠాత్తుగా ఆగిపోయింది. ఆ దేహాన్ని చూడలేకపోయాడు. తల బాధతో గిర్రున తిరిగిపోయింది. కాళ్లు భూమిమీద నిలవలేక నీరసంగా తేలిపోసాగాయి. రెండు నిముషాలలో అతడు స్మృతితప్పి భూమిమీదకి ఒరిగి పడిపోయాడు.

మొహంమీద చల్లటి నీళ్ళు ఎవరో చల్లగా అతడికి స్మృతి వచ్చింది. శర్మ ఇంక అక్కడ ఉండలేకపోయాడు. అంతటి మానవప్రేమనీ, మరణాన్నీ, దుఃఖాన్నీ ముఖాముఖిగా తారసిల్లి నిలబడగలిగే మనోదార్ఢ్యం అతడిలో లేకపోయింది. పిచ్చివాడిలాగ వెళ్లిపోయి తన కంపార్ట్‌మెంట్‌లో కూర్చొన్నాడు. కొంతసేపటివరకూ అతడిలో ఆలోచనాశక్తి నశించిపోయింది.

చాలాసేపటికి రైలు మళ్ళీ బయలుదేరింది. ఇదివరకు ఆ అబ్బాయీ, అమ్మాయీ కూర్చొన్న బెర్తులు ఎదురుగా ఖాళీగా కనిపించేసరికి అతడిలో దుఃఖం ఒక్కసారిగా పెల్లుబికింది.

"అయ్యో! పాపం!" అనిపించిందతనికి. అతడి మనస్థితికి పూర్తిగా విరుద్ధమైన ఈ సంఘటన అతడి హృదయపు లోలోతులలో సూటిగా తగిలింది. విజ్ఞానయాత్రవలె సాగిన అతడి జీవితానుభవం అంతా ఈ సంఘటనముందు చాలా అల్పం అయిపోయింది.

"ఆ అబ్బాయి బ్రతికి ఉంటే ఎంత బాగుండును! అతడి ముసలి తల్లిదండ్రులుగాని, నేనుగాని చచ్చిపోయి ఆ అబ్బాయి బ్రతికి ఉంటే ఎంత బాగుండును!" అని డాక్టర్ శర్మ అనుకొన్నాడు. ఇది కేవలం ఆ స్థితిలో ఆ యువదంపతులపైన కలిగిన క్షణికమైన సానుభూతి మాత్రమే కాదు. తన కళ్ళముందు ఒకరోజంతా అంత బాగా కనిపించిన ఆ జీవన సౌందర్యం, ఆ యువదంపతుల ఆనందమయమైన సంసారం అలాగ విశ్లథమైపోవడం అతడు సహించలేకపోతున్నాడు. ఆ ప్రమాద సంఘటనలో తను ఉద్దేశించిన మార్పుని డాక్టర్ శర్మ మనస్ఫూర్తిగానే ఆశింపసాగాడు.